క్లుప్తంగా

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ అధికారులు

కోట: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఏఈఎస్ జానకిరాం అన్నారు. విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీలో శనివారం మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఈబీ అధికారులు నిర్వహించారు. ఏఈఎస్ జానకిరాం మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల దశ ఎంతో కీలకమైనదని, కష్టపడి చదువుకుని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. ఎటువంటి చట్ట వ్యతిరేక పనులకు ఆస్కారం లేకుండా విద్యార్థులు మెలగాలని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. వాకాడు ఎస్ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి, కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, కిషంధర్ పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో అంతరతామర తొలగింపు



అంతరతామర మొక్కలను తొలగిస్తున్న కూలీలు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలోని చెరువుల్లో అంతరతామర పెరగడంతో వలస విహంగాల చేపల వేట, ఈతాడేందుకు ఆటంకం ఏర్పడింది. దీంతో చెరువులో తేలియాడుతూ ఉండే అంతరతామర మొక్కలు తొలగింపునకు స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కూలీలను ఏర్పాటు చేసి చెరువులోని అంతరతామర మొక్కలను తొలగించే పనులు నాలుగు రోజులుగా చేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్ తెలిపారు. చెరువుల్లో అంతరతామర నాలుగేళ్ల నుంచి ఇటు తమ శాఖకు అటు పక్షులకు సమస్యగా ఉందన్నారు. దీన్ని పూర్తిస్థాయిలో నివారించేందుకు కష్టపడాల్సివస్తోందని ఆయన తెలిపారు.

పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రత పాటించేలా ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలో అమరాగార్డన్ వీధిలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన స్వచ్ఛ సర్వేక్షన్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్థానికులను సమావేశ పరిచి పారిశుధ్యంపై పాటించాల్సిన విధానాలు, తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇంటివద్దకు వచ్చే మున్సిపల్ కార్మికులకు అందించే విషయమై అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛసర్వేక్షన్‌లో నాయుడుపేట మున్సిపాలిటీని ప్రథమంలో నిలిపేలా అందరు కృషిచేయాలని కమిషనర్ సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

వెంకటగిరి: విద్యార్థి దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని సాధించేందుకు కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య తెలిపారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం ఆ పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యతోనే రాణిస్తారని తెలిపారు. అనంతరం ప్రిన్స్‌పల్ తులసిజ్యోతిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

చిల్లకూరు: ఆత్మహత్యకు యత్నించిన తొణుకుమాల గ్రామానికి చెందిన మస్తాన్ చెన్నైలో చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు..మస్తాన్‌కు మూడేళ్ల క్రితం చిట్టేడుకు చెందిన అనూషతో వివాహం జరిగింది. మస్తాన్ మద్యానికి బానిస కావడంతో కుటుంబసభ్యులు అతన్ని మందలించారు. దీంతో మనస్తాపం చెందిన మస్తాన్ గడ్డిమందు తాగాడు. అస్వస్థతకు గురైన అతనిని చెన్నైలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధికి ఆధార్

- జిల్లాలో 95 శాతం ఆధార్ అనుసంధానం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు



ఆధార్ నమోదు చేస్తున్న క్షేత్ర సహాయకుడు



కలవకొండలో అమృత్ సరోవర్ పనులు చేస్తున్న కూలీలు

చిల్లకూరు: గ్రామీణ ప్రాంతాల్లో అడిగిన వారికి లేదనకుండా ఉపాధి పనులు కల్పించేలా రూపొందించిన ఉపాధి హామీ పథకంలో ఇప్పటివరకు పలు అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని నివారించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అవినీతి చోటుచేసుకోవడం పరిపాటిగా మారింది. దీంతో అక్కడ పనిచేసే కూలీలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. దీంతో ప్రభుత్వం కూలీలకు ఇబ్బంది లేకుండా చూడడంతో పాటు పనిచేసిన వారు తమ కూలిని తీసుకునేలా జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డులను అనుసంధానం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ ప్రక్రియను స్థానిక క్షేత్ర సహాయకులు పనిచేసే చోటే చేస్తుండగా సిగ్నల్ అందని వారు ఉపాధి కార్యాలయంలో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆధార్ అనుసంధాన ప్రక్రియ 90 శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇది పూర్తయితే కూలీలకు తాము కష్టపడి చేసినందుకు ఇచ్చే కూలి నేరుగా తమ బ్యాంకు ఖాతాలోనే పడుతుందన్న భరోసా ఉంటుంది.

ఏం చేయనున్నారంటే ..

ఉపాధి పథకంలో పనులు పూర్తి చేసిన అనంతరం టెక్నికల్ సిబ్బంది కొలతలు తీసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే వారు, ఈ ప్రక్రియను చేపట్టేందుకు మండలంలో ఒక ఏపీఓ, ఈసీ, టీఏలు, బీఎఫ్‌టీలు, ఎఫ్ఏలు, సీఓలు ఉన్నారు. వీరు ఎం బుక్‌లో నమోదు చేసి మండల ఎంసీలో అందించాలి. అక్కడ సీఓలు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇందుకోసం గతంలో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ఉండేది. ప్రస్తుతం ఎన్ఐసీ ద్వారా పనులు, నగదు చెల్లింపులు ఇతర వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. నూతన సాఫ్ట్‌వేర్ కావడంతో కూలీలకు నగదు చెల్లింపుల్లో కొంత ఆలస్యం కావడం, క్షేత్ర స్థాయిలో ఉండే వారు నగదు చెల్లింపులలో చేతివాటం చూపించడం లాంటి వాటికి అడ్డుకట్ట వేసేలా ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నారు. ఇది పూర్తి అయితే ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పక్కాగా కూలీల నగదు వారి బ్యాంకు ఖాతాలోనే జమ కానుంది.

తిరుపతి జిల్లా..

మండలాలు	33
జాబ్ కార్డులు	5,04,221
కూలీల టార్గెట్	63,298
ప్రస్తుతం పనిచేస్తున్న కూలీలు	48,409
పూర్తి అయిన అమృత్ సరోవర్ పనులు	47

కూలీలకు వరంలా అమృత్‌సరోవర్ పనులు..

కొన్ని ప్రాంతాల్లో ఉపాధి పథకానికి సరైన పనులు గుర్తించకపోవడంతో అలాంటి చోట్ల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్‌సరోవర్ పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది ఆగస్ట్ నాటికి జిల్లాలో మొత్తంగా 75 పనులు పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటికే 47 పూర్తి చేశారు. మిగిలినవి కూడా త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇవి పూర్తి అయితే నీటి నిల్వశాతం పెరగడంతో పాటు భారీగా భూగర్భజలాలు పెరుగుతాయి.

ఆధార్ అనుసంధానం పూర్తి చేశా..



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ అనుసంధానం గ్రామంలో పూర్తి చేశా. గ్రామంలో అమృత్‌సరోవర్ పనులు పూర్తి కావస్తున్నాయి. రెండవ విడత నిధులు మంజూరు చేస్తే పూర్తి స్థాయిలో పనులు పూర్తిచేస్తాం.

– బూదూరు నల్లయ్య, క్షేత్ర సహాయకుడు, కలవకొండ

95 శాతం పూర్తి..



క్షేత్ర సహాయకుల ద్వారా ఆధార్ అనుసంధానం చేస్తున్నాం ఎవరికైనా సర్వర్లు పని చేయకపోతే నేరుగా కార్యాలయంలోనే పనులు చేసేలా చర్యలు తీసుకుని ఇప్పటికి 95 శాతం పూర్తి చేశాం.

– గిరిబాబు, ఏపీఓ, చిల్లకూరు మండలం

ఎంతో ఉపయోగకరం

తిరుపతి జిల్లా ఉపాధి పథకంలో ఆధార్ అనుసంధానం ఎంతో ఉపయోగకరం. అనుసంధానంతో కూలి చెల్లింపులు పక్కదారి పట్టే అవకాశాలు ఉండవు. క్షేత్రసాయిలో ఎవ్వరూ తప్పులు చేయడానికి వీలుండదు.

– శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ

పేర్నాటిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, చిత్రంలో పేర్నాటి, ఎమ్మెల్సీ కల్యాణచక్రవర్తి

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని షాదీ మంజల్‌లో శనివారం సాయంత్రం గూడూరు పట్టణ, రూరల్ మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్యాంప్రసాద్‌రెడ్డి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషిచేశారన్నారు. ఈ మేరకు ఆయనను ఘనవిజయంతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ శ్యామన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించి, మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేసి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మ కోరారు. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. తనను గెలిపిస్తే అందరికీ అండగా ఉంటానని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గ అబ్జర్వర్ కోడూరు కల్పలత, పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నేతలు బత్తిని విజయ్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమిడి శ్రీనివాసులు, యారం మంజుల పాల్గొన్నారు.

చెంగాళమ్మ పరమేశ్వరికి సారె



సారె తీసుకొచ్చిన అంజూరు శ్రీనివాసులు దంపతులు, చిత్రంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరికి శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు శుక్రవారం రాత్రి చీర సారెను సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలనంతరం అమ్మవారి సారె సమర్పించడం ఆనవాయితీ కావడంతో సారె సమర్పించారు. శుక్రవారం అమ్మవారికి స్వర్ణ గోపుర శిఖర కలశస్థాపన కుంభాభిషేకం మహోత్సవాలు కావడంతో అంజూరు శ్రీనివాసులు దంపతులను స్థానిక ఎమ్మెల్యే కిలివేటి, చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి వారికి స్వాగతం పలికి సారెను అందుకున్నారు. అనంతరం వారికి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేయించి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆ తరువాత అమ్మవారి సువర్ణ విమానగోపుర కలశాలను కూడా దర్శించుకున్నారు.

గిరిజనుల అభ్యున్నతే లక్ష్యం



గిరిజన కార్పొరేషన్ గోదాములో మారేడు గడ్డలను పరిశీలిస్తున్న మందారాణి

రాపూరు: నెల్లూరు జిల్లాలోని గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ మందారాణి తెలిపారు. రాపూరు మండలంలో శనివారం గిరిజన కో–ఆపరేటివ్ సొసైటీని, వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె పంగిలిలోని గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులతో వారికి ఆర్థికలాభాలు చేకూరేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పంగిలి, గోనుపల్లి, తెగచర్ల, గరిమెనపెంట, ఏపూరు గ్రామాల్లో 16వన్‌ధన్ వికాస గ్రూపులో 275 మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. గిరిజనులు సేకరించిన అటవీ ఫలాలను దళారుల పాలుకాకుండా జిల్లాలో ఆరు చోట్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రూ.30 లక్షలు నిధులు మజూరు చేసిందన్నారు. గిరిజనులు అడవుల్లో తిరిగి సేకరించకుండా వారి భూముల్లోనే స్వంతంగా మారేడు గడ్డ, కుంకుడు, ఉసిరి పండించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆమె వెంట డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఏపీఎం అనురాధ, హార్టికల్చర్ ఏపీఎం కరీం, ఏపీఎం కృష్ణయ్య, మస్తాన్‌వల్లి, గిరిజన నేత జయరామయ్య ఉన్నారు.

నేదురుమల్లి ఫౌండేషన్‌తో ఐఐహెచ్‌టీకి పూర్వవైభవం



ఐఐహెచ్‌టీ షెడ్‌లను పరిశీలిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు, సురేష్‌రెడ్డి

వెంకటగిరి: నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ హ్యాండ్‌ల్యూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) కళాశాలకు పూర్వవైభవం దిశగా చర్యలు తీసుకుంటున్నారని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి తెలిపారు. శనివారం నేదురుమల్లి ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన ఐఐహెచ్‌టీని పరిశీలించారు. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఐఐహెచ్‌టీ కళాశాల విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా దెబ్బతిన్న వర్క్‌షెడ్‌ల మరమ్మతులను నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి స్వంతనిధులతో చేపట్టనున్నారని తెలిపారు. కళాశాలను మరింత అభివృద్ధి చేసేలా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్వవైభవం తీసుకొస్తారని తెలిపారు. పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జి ఢిల్లీబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు కాసుల శివకుమార్ పాల్గొన్నారు.

చిల్లకూరు ఎస్ఐకు అభినందన



ఎస్ఐను అభినందిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

చిల్లకూరు: చిల్లకూరు ఎస్ఐ గోపాల్‌ను శనివారం జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి అభినందించారు. తిరుపతిలో శనివారం జరిగిన క్రైం మీటింగ్‌లో ఎస్ఐను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. బైక్‌ల చోరీ కేసులో 32 బైకులను స్వాధీనం చేసుకోవడంతో పాటు లోక్ అదాలత్‌లో జిల్లాలోనే ఎక్కువ కేసులను పరిష్కరించి రాజీ మార్గంలో నడిపించడంతో పాటు క్రైమ్ రేటు తగ్గించడం, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ పనితీరును మెచ్చుకుంటూ జిల్లా ఎస్పీ చిల్లకూరు ఎస్ఐకు ప్రశంసాపత్రంను అందజేసి అభినందించారు.

నిధుల మంజూరు ఘనత జగన్‌దే



రైతుబజారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక, రాష్ట్రంలోనే మొట్టమొదటగా గూడూరు రైతుబజార్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో రూ.1.15 కోట్లతో అన్ని వసతులతో అత్యాధునికంగా నిర్మించిన రైతుబజారును ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న రైతుబజారులో పట్టలు కట్టుకుని, వ్యాపారాలు సాగిస్తుండేవారన్నారు. వర్షాకాలం వస్తే వ్యాపారులు, అటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. ఈ పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన అడిగిన వెంటనే రూ.1.15 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. కరోనా పరిస్థితుల దృష్ట్యా, నిర్మాణంలో కొంత జాప్యం జరిగిందన్నారు. అనంతరం ఆధునికంగా, అన్ని వసతులతో నిర్మాణ పనులు పూర్తయ్యాయి అన్నారు. అలాగే కూరగాయల మార్కెట్ కూడా పూర్తయ్యిందన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పట్టణ ప్రధాన రహదారి రాజావీధి కూడా గుంతలమయంగా ఉండేదన్నారు. ఆ పనులు కూడా పూర్తి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని ఆయన తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బాలాయపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఎంపీడీఓ స్వరూపరాణి, ఏఓ వినీల్, ఆర్ఐ పూర్ణ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న పూర్వవిద్యార్థులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 1986–87 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల పూర్వ సమ్మేళనం జరిగింది. పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ముందుగా ఇటీవల మృతిచెందిన పలువురికి మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఏవరైనా ఇబ్బందుల్లో ఉంటే వారికి ఆర్థికసాయం చేయాలని తీర్మానించుకున్నారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షుడు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి, ఎన్ఆర్ఐ దువ్వూరు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు: గ్రామ సచివాలయాల్లో అందిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేష్‌బాబు సూచించారు. శనివారం స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును ఎంపీడీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 సచివాలయాలల్లో ఆధార్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీవారికి బంగారు చైన్ బహూకరణ



ఏసీకి బంగారుచైన్ అందిస్తున్న దాతలు



వెండి చెంబు అందిస్తున్న దాతలు

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి శనివారం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కె.శ్రీహరి, భార్య మహాలక్ష్మి 12గ్రాముల 400 మిల్లిగ్రాములు గల బంగారు చైన్ బహూకరించినట్లు ఆలయ ఏసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా నెల్లూరు జిల్లా చెజర్లమండలం ఆదురుపల్లికి చెందిన పెంచల నరసింహులు, కుమారుడు అయాన్ 500 గ్రాముల వెండి అష్టలక్ష్మి ప్రతిమ గల చెంబును బహూకరించినట్లు ఏసీ తెలిపారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించినట్లు ఆయన తెలిపారు.

బాగా చదివి ఉన్నతంగా ఎదగాలి

గూడూరు: బాగా చదివి, జీవితంలో ఉన్నతంగా ఎదగాలని వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ ఉప్పల నూకేశ్వరరావు సాయిరాం పేర్కొన్నారు. పట్టణంలోని సీఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదివే విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం గమళ్లపాళెంలోని మెప్మా పునరావాస కేంద్రంలోని వృద్ధులకు క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. క్లబ్ గూడూరు అధ్యక్షుడు ఏ.హరిబాబు, బాబ్జి, బొంతల వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రావు, సుబ్బారావు, కిషోర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



దక్కిలిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ



ఏకొల్లు పాఠశాలలో ఎంఈఓ..

దక్కిలి: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని ఎంఈఓ కె. వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం దక్కిలి జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కొత్త మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో కలిగి ఉండాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట దక్కిలి కాంప్లెక్స్ హెచ్ఎం ఎస్.సుబ్రమణ్యం, సీఆర్పీ అనిత ఉన్నారు.

జగనన్న గోరు ముద్ద తనిఖీ..

దొరవారిసత్రం: ఏకొల్లు గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో జగనన్న గోరు ముద్ద నిర్వహణను శనివారం ఎంఈఓ మస్తానయ్య తనిఖీ చేశారు. ఆయన వెంట హెచ్ఎం చక్రవర్తి ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): వేసవి సమీపిస్తుండడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బాలాయపల్లిలోని స్త్రీశక్తి భవనంలో శనివారం ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్యలేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీడీఓ స్వరూపరాణి, తహసీల్దార్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి, వాన పార్వతి, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలాయపల్లి మండలం జయంపు గ్రామంలో మార్చి 2న, మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు బాలాయపల్లి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు.